


# టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



# పట్టుదారాల చెట్టు    రవీంద్రనాథ టాగోర్

తెలుగు సేతః చంద్రలత

బోలాయ్, బెంగాలీ, 1928



ప్రకృతిలోని సకల చరాచర జీవరాశిలో మనిషి పుట్టుక అత్యున్నత దశ అని అనుకుంటాం. చరిత్రపుటలను తిరగేసినపుడల్లా, సమస్త జీవరాశి తనలో ఇమిడిపోయే మనిషి ఆవిర్భవించాడా అని కూడా అనిపిస్తుంది. ప్రతి మనిషిలోనూ ఆవు, పులి, పాము, ముంగీసా లాంటి అనేక జీవరాశుల స్వభావాలు సహజీవనం చేస్తుంటాయి.

అందుకేనేమో, మనిషి ఒక్కోసారి ఆవులా సాధువులా, పరోపకారిలా ఉంటాడు. మరోసారి, పులిలా గాండ్రిస్తాడు, పాములా బుసలు కొడతాడు, ముంగీసలా పోరాడుతాడు. అంతే కాదు, చిలకలా పలుకుతాడు, నెమలిలా నాట్యం చేస్తాడు, కోయిలలా పాడుతాడు.

అది ఎలా అంటే —— “స, రి, గ, మ, ప, ద, ని” అంటూ ఏడు మూలాక్షరాలతో కూర్చిన సంగీతంలాగా. ఒక్కో రాగంలో "స" ఎక్కువసార్లు వినబడుతుంది, మరో రాగంలో "గ" గట్టిగా పలకరిస్తుంది. అలాగే, కొన్ని రాగాలు మధ్యమంలో సాగితే, మరికొన్ని కోమలగాంధారంలోనో పంచమంలోనో శ్రావ్యమవుతాయి

సరిగ్గా అలాగే, మా అన్నయ్య కొడుకు బోలాయ్‌లో చెట్టు చేమకు చెందిన మూలాక్షరాలు నాటుకొని ఉన్నాయా అనిపిస్తుంది. ఆ పచ్చదనపు బీజాక్షరాలు బోలాయ్‌లో బిగ్గరగా ధ్వనిస్తుంటాయి.



పసి వయసు నుంచే, బోలాయ్‌కి నిశ్శబ్దంగా నిలబడి ప్రకృతిని గమనించడం అలవాటు. అతని ఈడు పిల్లలు చుట్టూ చేరి గెంతులు వేస్తూ అల్లరి చేసేవారు. రెండు కాళ్లు ఒక్కచోట నిలపకుండా తిరుగుతూ, చుట్టూ ఉన్న లోకాన్ని పరిశోధించేవారు. సందడి సందడిగా సాహసాలు చేసేవారు.

కానీ, బోలాయ్ మౌనంగా నిలబడి, చుట్టూ పరుచుకొని ఉన్న ప్రకృతిని చూస్తూ ఉండేవాడు.

కారుమబ్బులు దొంతరలుగా తూర్పు ఆకాశంలో గుంపు కట్టినప్పుడు, బోలాయ్ అణువణువూ ఆ శరదృతువు అడవి పరిమళాల తడితో నిండి పోయేది.

ఆ వాన కుంభవృష్టి అయినపుడు, బోలాయ్ శరీరం ఆ వర్షపు ధ్వనిలోని రాగాలను వినేది.

మధ్యాహ్నం ఎండమండిపోయేటప్పుడు, చొక్కా తీసేసి, ఇంటి పై కప్పు మీదకు ఎక్కి, అక్కడే అటూ ఇటూ తిరిగేవాడు. ఆ మిట్టమధ్యాహ్నం సూరీడికి ఎదురొడ్డి నిలబడిన బోలాయ్, 'అతని బోసి ఛాతీలోంచి తన గుండెలోకి సూర్యరశ్మిని నింపుకొంటున్నాడా?' అని అనిపించేది.

మాఘమాసంలో మామిడి పూసినపుడు,ఆ పూల పరిమళాల సంతోషాన్ని అతని రక్తంలో నింపుకొన్నట్టు, అతని లో తెలియని కొత్త ఉత్సాహం ఉరకలు వేసేది. ఫాల్గుణమాసంలో సాలవృక్షాలపై అలముకొనే నిండుగా విరబూసిన పువ్వుల ముదురు రంగులా.

అలాంటప్పుడు, బోలాయ్ వంటరిగా కూర్చోవడానికి ఇష్టపడేవాడు. తనకు తెలిసిన పిల్లల కథలన్నీ తానే చెప్పుకొంటూ, ఆ ఊడలు దిగిన మర్రిచెట్టు తొర్రల్లోని పిట్టల కథలన్నీ గుర్తుకు చేసుకొంటూ.

తన పెద్ద పెద్ద కళ్లను విప్పార్చి, తన పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించే బోలాయ్, ఎక్కువగా మాట్లాడేవాడు కాదు.



బోలాయ్ బుర్రనిండా ఆలోచనలు ఝుమ్మంటూ గూడు కట్టుకొంటూ ఉంటే, మౌనంగా నిదానించి చూసేవాడు.

ఒకసారి బోలాయ్‌తో కలిసి మా ఇంటి దగ్గరి కొండ మీదకి ఎక్కాను. అక్కడ నుంచి చూస్తే, కొండవాలున మా ఇంటికి వెళ్ళే దారంతా పచ్చిక పరుచుకొని ఉంది. ఎవరో పని గట్టుకొని పచ్చని గరికను నాటినట్లుగా. బోలాయ్ ఆ గరిక పచ్చని కొండవాలుని చూసి భలే సంబరపడ్డాడు. బోలాయ్ దానిని 'ఒక లోయ పక్కని కొండచరియ' అని ఎన్నడూ భయపడలేదు. పైనుంచి దానిని పచ్చని జారుడుబండ అని అనుకొనే

వాడు.

బోలాయ్ పకపకా నవ్వుతూ,పరుగులు పెట్టి ఇష్టపడే వెళ్ళేవాడు. ఆ పచ్చిక మీద గిరగిరా దొర్లుతూ, కొండ కిందనున్న ఇంటికి చేరుకొనేవాడు. బోలాయ్ వళ్లంతా పచ్చికే. అలా దొర్లేటప్పుడు, పచ్చిక కొనలు బోలాయ్ మెడమీద గిలిగింతలు పెట్టినట్లు, బిగ్గరగా పగలబడి నవ్వేవాడు. బోలాయ్ నవ్వుల సంతోషం ఆ లోయంతా ప్రతిధ్వనించేది.

రాత్రంతా కురిసిన వర్షం ముగిసాక, పర్వతాల పైనుంచి ఉదయించే సూరీడి బంగారు కిరణాలు దేవదారు వృక్షాల మీద వాలేవి. ఆ వెలుగుల వాలుల్లో దేవదారు నీడలు లోయంతా పరుచుకొనేవి. ఆ నీడల్లోకి బోలాయ్ పరుగులు పెట్టేవాడు. ఆ దేవదారు నీడల్లో, ఒకనాటి కథలన్నీ వెతుక్కొనే వాడు —— "అనగనగా ఒకానొకప్పుడు..." అనుకొంటూ.

అతని పెద్దపెద్ద కళ్ళు ఎప్పుడూ ఆలోచనల్లో మునిగి ఉండేవి. మేఘాల్లోకి ఎత్తుగా ఎదిగిపోయిన ఆ సూదంటు చెట్టు కొనల వైపే బోలాయ్ చూపు చిక్కుకొని ఉండేది.

అప్పుడప్పుడు, బోలాయ్ చూపు నేలమీదకు వాలీ, దేనినో అన్వేషించడం నేను గమనించాను.


నేల రాలిన విత్తనం మొలకెత్తి, చిన్ని మొలక వెలుగులోకి తలయెత్తేదాకా, బోలాయ్ చాలా అసహనంగా ఎదురుచూసేవాడు.

ప్రతిరోజూ, నేల మీదికంటా వంగి కథ వినేటప్పుడు పిల్లలు "ఊ..." కొడుతూ, మిగిలిన కథ ఏం జరిగిందన్న ఉత్కంఠతో కుతూహలంగా అంటారే, అలా అనేవాడు.

"ఊ... ఆ తరువాత? ఆ తరువాత? ఆ తరువాత?"

ఆ చిన్ని చిన్ని మొలకలు ఇంకా పూర్తి కాని కథల్లా అనిపించేవి బోలాయ్‌కి.

అది ఎలా చెప్పాలో తెలియక,తడబడి పోయేవాడు.



అప్పుడే మట్టిలో నుంచి పుట్టిన ఆ నునులేత మొక్కలు కూడా బోలాయ్‌తో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నట్లుగా అనిపించేది.

బహుశా ఆ మొక్కలు, "నీ పేరేమిటి?", "మీ అమ్మ ఎక్కడికి వెళ్ళింది?" అని అడుగుతున్నాయేమో.

బహుశా బోలాయ్ వాటికి జవాబు ఇస్తున్నాడేమో!

"నాకు అమ్మ లేదు." అని.

ఎవరైనా కొమ్మ మీద పూసిన పువ్వును తుంచితే, బోలాయ్ ప్రాణం పోయినట్లుగా విలవిలలాడి పోయేవాడు.

అయితే తన బాధ ఎవరికీ ఒక పట్టాన అర్థంకాదని బోలాయ్ త్వరగానే గ్రహించాడు.

అతని తోటిపిల్లలు కసరుపిందెలు కొట్టడానికి చెట్టు మీదకు రాళ్ళు విసిరితే, బోలాయ్ అక్కడ నుంచి వడివడిగా వెళ్ళిపోయేవాడు.

బోలాయ్‌ని ఏడిపించడానికి సాటి పిల్లలు తోట మీద దండయాత్ర చేసే వారు.

కొమ్మలు విరిచి వాటిని చేతిలో పట్టుకొని, తోటలోని పొదలన్నిటినీ చిందరవందరగా కొట్టేవారు.

క్షణాల్లో పూత మీదున్న పొగడచెట్టు కొమ్మలను విరగ కొట్టేవారు.

ఈ భీభత్స విధ్వంసానికి బోలాయ్ తల్లడిల్లిపోయేవాడు.

తట్టుకోలేకపోయేవాడు.

ఐనా, ఏడవడానికి కూడా సిగ్గుపడేంత సున్నితమైన బోలాయ్ అతని తోటిపిల్లలకు ఏ మాత్రం అర్థం అయ్యేవాడు కాదు.

అయితే బోలాయ్‌ని ఎలా ఆట పట్టించాలో అర్థం కాక అల్లరి పిల్లలు అయోమయంలో పడేవారు.

తమ ఆటలలోకి బోలాయ్‌ని ఎలా కలుపుకోవాలో అర్థం కాక తోటిపిల్లలు వింతపడేవారు.



ఇక బోలాయ్‌ని ఎక్కువగా ఇబ్బంది పెట్టేది తోటమాలి రాక.

తోటమాలి కలుపు తీసి, గడ్డిని కత్తిరించి, తోటను శుభ్రం చేసే వాడు.

ప్రతిరోజూ బోలాయ్ మెత్తని పచ్చిక మీద మెల్లిగా నడుస్తూ, బోలెడన్ని అద్భుతాలు గుర్తించే వాడు.

అక్కడో పచ్చని తీగ, ఇక్కడొక వంగ, పసుపు కలసిన పేరు తెలియని పువ్వు.

బంగారు రంగు అద్దుకొన్న నీలిపూలు, అక్కడ గోడలా పెరిగిన నేలవేము, ఇక్కడ తీవెలు బారుతోన్న పాలతీగ, పిట్టలు కొరికి పడేసిన వేపవిత్తులోనుంచి వెలుగు చూస్తోన్న నునులేత చిగురాకులు ఎంత అందంగా ఉన్నాయో!

అయితే ఇవేవీ ఏ తోటలోనూ ఇష్టంగా పెంచుకొనే మొక్కలు కావు.

వాటి గోడు ఎవరూ పట్టించుకోరు.

వీటన్నిటినీ తోటమాలి కలుపు మొక్కలని అంటూ నిర్దాక్షిణ్యంగా తీసి పారేస్తాడు.

ఒక్కోసారి బోలాయ్ వాళ్ల పిన్ని వళ్ళో కూర్చుని, ఆమె మెడ చుట్టూ చేతులు వేసి, గోముగా అడిగేవాడు.

"పిన్నీ, ఆ కలుపు తీసే మనిషిని నా బుజ్జి మొక్కలకు పీకేయవద్దని, పచ్చికను కత్తిరించవద్దని చెప్పవా?"

అప్పుడు బోలాయ్ వాళ్ల పిన్ని అనేది, "బోలాయ్, ఒక్కోసారి నువ్వు చిత్రంగా మాట్లాడుతావు!

కలుపుతీయకపోతే తోటంతా అడవిలా తయారవుతుంది!"

ఆ మధ్యనే బోలాయ్ ఒక గట్టిపాఠం నేర్చుకొన్నాడు.

కొన్ని దిగుళ్ళు తనవి మాత్రమేననీ, ఎవరికి చెప్పినా ఏమీ అర్థం కావననీ!

ఈ పిల్లవాడి వయస్సు, అంటే నిజవయస్సు, ఈ చెట్టూచేమా జంతుజాలం పుట్టని కోట్లాది ఏళ్ళ క్రితం మట్టిని తొలుచుకొని మొలిచిన మొదటి విత్తులోని మొలక నాటిది.

అప్పుడు కేవలం ఈ భూమండలం మీద మట్టి, బురద, నీళ్ళు నిండి ఉంటాయి.

ఒక్క ప్రాణి ఉనికి కూడా లేని ఆ కాలంలో, మట్టిలో పుట్టిన మొట్ట మొదటి మొలకలు మొక్కలై, మొక్కలు చెట్లై, చెట్లు మానులై, మహావృక్షాలయి ఉంటాయి.

ఆ ఆకాశాన్నంటే వృక్షాలు చేతులెత్తి సూర్యుణ్ణి అడిగి ఉంటాయి.

"నేను నిలబడతాను. నేను జీవిస్తాను. నేను నిరంతర అన్వేషకుణ్ణి. సజీవంగానూ, నిర్జీవంగానూ నా జీవితం కొనసాగుతుంది. సూర్యుడిలోనూ, మేఘంలోనూ, పగలూ రాత్రీ...!"

కాలగమనంలో సమస్త చరాచర జీవరాశికీ ఆ మొట్టమొదటి చెట్లే ఊపిరి అయ్యాయి.

కాలపథాన్ని నడిపే నాయకులయ్యాయి.

ఈ రోజటికి కూడా ప్రతిమొక్కా ప్రతి చెట్టూ, "నేను జీవిస్తాను! నేను జీవితాన్నిస్తాను!" అని గుసగుసలాడుతున్నట్లుగా ఉంటుంది.

మాటాపలుకు లేని చెట్లే అనాదిగా జీవరాశికి వెలుగునూ, శక్తినీ, సుగంధాన్ని, లావణ్యాన్ని అద్దాయి.

ఆ ఆకాశం నుంచి అమృతాన్ని పిండి, తేనెధారలు ప్రవహింపజేస్తాయి.

ఆ ఉన్నతమైన వెలుగుల లోకం వైపు తలెత్తి ధీమాగా చూస్తూ నిలబడతాయి.

"నేను నిలదొక్కుకున్నాను! నేను నిలబడ్డాను!" అన్నట్లుగా.

ఆ మట్టి చెట్ల పిలుపును బోలాయ్ తన నరనరాల్లో ప్రతిధ్వనించినట్లుగా వినేవాడు.

బోలాయ్ మాటలకు మేము నవ్వకుండా ఉండలేకపోయే వాళ్ళం.



•

ఒక రోజు పొద్దున్నే తీరిగ్గా వార్తాపత్రిక చదువుతుంటే, నా దగ్గరికి బోలాయ్ పరిగెత్తుకొంటూ వచ్చాడు.

నా చేయి పట్టుకొని నన్ను తోటలోకి లాక్కెళ్ళాడు.

అప్పుడే వెలుగు చూసిన ఒక చిన్నిమొలకను చూపించాడు.

"బాబాయ్! ఇదేం మొక్క?"

అది ఒక బూరుగదూది మొక్క.

గులకరాళ్ళ దారిలో మొలిచింది.

అది పట్టుదారాలు ఇవ్వగల ప్రత్తి చెట్టుగా పెరుగుతుంది.

బోలాయ్ ఆ మొక్కను నాకు చూపించి పొరపాటు చేశాడు.

పసిపిల్లల వచ్చీరాని మాటల్లా ముచ్చటగా ఉన్నాయి అప్పుడే విచ్చుకొన్న ఆ మొదటి మొలక చిగుళ్ళు.

ఆ రోజు నుంచీ బోలాయ్ ఆ పట్టుదారాల చెట్టు చుట్టూనే తన ధ్యాస నిలిపాడు.

పొద్దున్న సాయంత్రం ఆ మొక్క ఎంత ఎత్తు పెరిగిందో చూసేవాడు.

బూరుగదూది చెట్టు ఇట్టే పెరిగిపోతుంది.

కానీ బోలాయ్ ఉత్సాహం కన్నా వేగంగా కాదు కదా!

ఒక మూరెడు ఎత్తు పెరగగానే, నాకు మళ్ళీ చూపించాడు.

వత్తుగా పెరిగిన దాని నునుపు ఆకులు నాకు సంతోషాన్ని కలిగిస్తాయని బోలాయ్ అనుకున్నాడు కాబోలు.

నేను అన్నాను,

"ఇక, తోటమాలిని పిలిపించి చెపుతాను. అతను ఈ మొక్కను పీకేస్తాడు!"

"బాబాయ్! ఏమంటున్నావ్?" బోలాయ్ బిత్తరపోయాడు.

ఏదో ఘోరమైన మాట విన్నట్టుగా.

"వద్దు బాబాయ్! ఆ పట్టుదారాల చెట్టును పీకేయద్దు, బాబాయ్!" బోలాయ్ బతిమిలాడాడు.

"బోలాయ్! నీ బుర్రలోకి ఏమి ఎక్కిందో ఏమోరా! చూడు నాన్నా, ఆ మొక్క దారికి అడ్డంగా ఉంది. చెట్టు బాగా పెరిగి పెద్దది అయిపోయిందనుకో, పత్తికాయలు పగిలిపోతాయి. ఈ దారంతా, ఈ చుట్టుపక్కలంతా దూదిపింజెలతో నిండిపోతాయి. మనకి పిచ్చెక్కుతుంది!" నేను నెమ్మదిగానే అన్నాను.

నన్ను ఒప్పించలేక, ఈ అమ్మలేని పిల్లవాడు వెక్కిళ్ళు పెడుతూ, వాళ్ల పిన్ని ఒడిలోకి దూరాడు. ఆమెను వాటేసుకొని ఏడుపు ఆపుకొంటూ బతిమిలాడాడు.

"పిన్నీ... పిన్నీ, నువ్వన్నా చెప్పు పిన్నీ, బాబాయిని ఆ పట్టుదారాల చెట్టును పీకేయ వద్దని చెప్పు పిన్నీ!"

బోలాయ్ సరైన మార్గాన్నే ఎంచుకొన్నాడు!

వాడి పిన్ని కేకేసింది.

"ఏమండోయ్! బోలాయ్ చెపుతున్నాడుగా... ఆ పట్టుదారాల చెట్టుని దానిమానాన దానిని వదిలేయండి!"

ఇక, ఏం చేస్తాను? ఇల్లాలి మాట జవదాటగలమా? అలాగే, నేను ఆ పట్టుదారాల చెట్టు జోలికి వెళ్ళకుండా, దానిని తోటమాలితో పీకించకుండా అలా వదిలేసాను.

బోలాయ్ నాకు ఆ బూరుగదూది మొక్కను చూపించకుండా ఉంటే బావుండేది. దానిని పట్టించుకొనే వాడిని కాదు. ఇప్పుడు నేను ఎటు వెళ్ళినా నా చూపు ఆ మొక్క మీదే పడుతోంది.

ఎలాంటి అడ్డూ అదుపూ లేకుండా ఆ పట్టుదారాల చెట్టు చకచకా ఎదిగిపోతోంది. ఒక్క ఏడాదిలోనే ఆ చెట్టు చేత ఎత్తు ఎదిగిపోయింది. బోలాయ్ తన అభిమానాన్ని అంతా ఆ చెట్టు మీదే కురిపిస్తున్నాడు. ఆ పట్టుదారాల చెట్టూ పెరుగుతున్న కొద్దీ నా కళ్ళకు మొరటుగా కనిపించసాగింది. దారికి అడ్డంగా, ఎలాంటి అనుమతులు లేకుండా, గంటకో తీరుగా పెరిగిపోతోంది ఆ మొక్క.

ఎవరు చూసినా, "ఆ మొక్క ఏంటలా దారికి అడ్డంగా పెరుగుతోంది!" అని ఆశ్చర్యపోయేవారు.

రెండు మూడు సార్లు ఆ చెట్టుకి మరణదండన వినిపించాను!

చివరికి, బోలాయ్‌కి ఒక మంచి ప్రతిపాదన చేసాను.

ఆ చెట్టు కొట్టేసి, దాని స్థానంలో అందమైన గులాబీలను పెంచుకోమని చెప్పాను.

"బోలాయ్, నీకు పట్టుదారాల చెట్టే కావాలనుకో నాన్నా, అదుగో ఆ గోడవారగా వరసగా మొక్కలు నాటుకో. చక్కగా పెరుగుతాయి," అని నచ్చజెప్పాను.

నేను ఎప్పుడు ఆ మొక్కను పీకేద్దామని అన్నా, బోలాయ్ మరుక్షణంలో ఒక్క పరుగున వెళ్ళి వాళ్ల పిన్ని చెంతకు చేరుతాడు. ఇక, బోలాయ్ పిన్ని అంటుంది,

"అబ్బబ్బా! ఇక, ఆ మొక్క విషయం వదిలేద్దురూ! అయినా, చూడడానికి అదేమీ అందవికారంగా ఏమీ లేదుగా!"

•

మా వదిన బోలాయ్ చిన్నతనంలోనే కన్ను మూసింది.

వదినమీది దిగులుతో అన్నయ్య ఇంగ్లండు వెళ్ళిపోయాడు. అక్కడ ఇంజనీరింగ్ చదువులో మునిగిపోయాడు.

పిల్లలు లేని మా ఇంట్లో, అతని పిన్ని బోలాయ్‌ని స్వంత బిడ్డలా గారాబంగా పెంచుతోంది.

దాదాపు పదేళ్ళ తరువాత అన్నయ్య తిరిగి వచ్చాడు.

బోలాయ్‌కి పాశ్చాత్య విద్య చెప్పాలని, తనతో పాటు ఇంగ్లండుకి తీసుకు వెళుతున్నాడు.

దానికన్నా ముందుగా పాశ్చాత్య విద్యను పరిచయం చేయడానికి కొంతకాలం సిమ్లాలో బోలాయ్‌ని ఉంచుతున్నాడు.

ఆ తరువాత అక్కడ నుంచి ఇంగ్లండుకు వెళ్ళిపోతారు.

బోలాయ్ వాళ్ల పిన్నిని వదలలేక వదలలేక ఏడుస్తూ వదిలి వెళ్ళాడు.

బోలాయ్ లేని మా ఇల్లు బోసిపోయింది.

రెండేళ్ళు గడిచిపోయాయి.

బోలాయ్ వాళ్ల పిన్ని ఎవరూ చూడకుండా కళ్ళనీళ్ళు పెట్టుకొంటూనే ఉంది.

బోలాయ్ గదిలోకి వెళ్ళి ఆ ఖాళీ గదిని మళ్ళీ మళ్ళీ సర్దుతూనే ఉంది.

అతని చిరిగిపోయిన బూట్ల జతను, విరిగిపోయిన బంతిని, జంతువుల బొమ్మలతో నిండిన అతని కథల పుస్తకాన్ని మాటిమాటికీ సర్దిందే సర్దుతుంది.

బోలాయ్ వీటన్నిటినీ ఆమెకు జ్ఞాపకల్లా వదిలి వెళ్ళాడు.

తను మాత్రం పెద్దవాడవుతున్నాడు.

ఆమె దిగులుగా కూర్చుని బోలాయ్ గురించే ఆలోచిస్తూ ఉండేది.

ఒక రోజు విపరీతంగా పెరిగిపోయిన పట్టుదారాల చెట్టు నా కంటపడింది.

ఇక, దానిని గారాబం చేయనవసరం లేదు. అందుకే దానిని కొట్టేసాను.

సరిగ్గా అప్పుడే వాళ్ల పిన్నికి బోలాయ్ ఉత్తరం రాశాడు, సిమ్లా నుంచి.

"పిన్నీ, నా పట్టుదారాల చెట్టును ఫోటో తీసి పంపవా ప్లీజ్?" అంటూ.

బోలాయ్ ఇంగ్లండుకు వెళ్ళే ముందు మమ్మల్ని కలవవలసి ఉంది. కానీ అది వీలుపడడం లేదు.



బోలాయ్ తనతో పాటు తన స్నేహితుడైన పట్టుదారాల చెట్టు ఫోటోను తీసుకువెళదాం అనుకొన్నాడు.

అందుకే వాళ్ల పిన్నికి ఉత్తరం రాసాడు.

ఇక, బోలాయ్ వాళ్ల పిన్ని నన్ను కేకేసింది.

"ఏమండోయ్ వినండి! ఒక ఫోటోలు తీసే మనిషిని వెంటనే పిలిపించండి!"

"ఎందుకు?"

అప్పుడే ఆమె బోలాయ్ ఉత్తరం నా చేతిలో పెట్టింది.

ఇంకా కుదురుగా రాయడం నేర్వని చిన్న పిల్లవాడి రాత అది.

"కానీ, ఆ చెట్టూ ఎప్పుడో కొట్టేసాంగా!"

.

బోలాయ్ వాళ్ల పిన్ని రెండు రోజులు అన్నపానీయాలు ముట్టలేదు.

ఆ తరువాత చాలా రోజుల వరకు నాతో మాట్లాడలేదు.

బోలాయ్ నాన్న వాడిని ఆమె వెచ్చని ఒడిలోనుంచి తీసుకు వెళ్ళిపోయాడు.

బోలాయ్ బాబాయ్ వాడికి ఆరో ప్రాణమైన ఆ పట్టుదారాల చెట్టును మొదలంటా నరికివేసాడు.

ఆమె ప్రపంచాన్ని ఛిద్రం చేసారు.

ఆమె మనసును గాయపరిచారు.

ఆమె దృష్టిలో—

తన ఒడిని వదిలి వెళ్ళిన బోలాయ్ పసితనపు పచ్చదనానికి ప్రతిరూపం...

ఆ పట్టుదారాల చెట్టు!

## Foot Note:

1.నేలవేము (Kalmegh) 2.పాలతీగ (Anontomul)

3.image: Silk cotton Tree

https://commons.wikimedia.org/wiki/File:Bombax_Ceiba_cotton_pods.JPG

4. All other images Meta AI generated.

**References:**


1. https://www.tagoreweb.in/Stories/galpoguchchho-84/bolai-1940
2. *Bolai*, Rabindranath Tagore, Translated from Bengali by Prasenjit Gupta https://www.parabaas.com/translation/database/translations/stories/gBolai.html
3. bolai #soumitrachattopadhyay #rabindranathtagore #shortstory https://www.youtube.com/watch?v=tmsBdyOdifI

### అనుసృజకుల వ్యాఖ్యానం

ప్రకృతికీ, మనిషికీ ఉన్న సంబంధాన్ని అందంగా, సున్నితంగా, మనోజ్ఞంగా ఆవిష్కరించిన కథ ఇది. పసితనానికి, పచ్చదనానికి ఉన్న బంధానికి ఈ కథ ఒక ప్రతిరూపం.

బోలాయ్ ఒక చెట్టును పెంచినా, అతని పిన్ని ఒక బిడ్డను (బోలాయ్‌ని) పెంచినా, ఆ మానవస్పర్శలోని అనుభవాన్ని, గాఢతను, సున్నితత్వాన్ని అర్థం చేసుకోవడమే ఈ కథకు జీవం. ఈ కథ టాగోర్ జీవించిన ప్రకృతితత్వపు గ్రహింపుకై తెరిచిన ఒక వెలుతురు ద్వారం.

మనందరిలోను సహజంగా ఉన్న ఆ బాబాయిని మొట్టికాయవేసి, మనలోని ఆ బోలాయిని తట్టిలేపే చెణుకు.

ఈ బోలాయ్ (పట్టుదారాల చెట్టు) కథను టాగోర్ మొదట శాంతినికేతనం 'వర్ష ఉత్సవం' లో చదివి వినిపించారు.

ఆ తరువాత *ప్రబాసి* (బోలాయ్, 1928) లో అచ్చయ్యింది.విశ్వభారతి ప్రచురించిన "గల్పగుచ్ఛా" కథాసంకలనం లో చోటుచేసుకుంది.

★★★

COMMENTS